క్లుప్తంగా

ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓగా యాకోబు



శావల్యాపురం: మండల (ఎఫ్‌ఏసీ) ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓగా బొడ్డు యాకోబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రస్తుతం శావల్యాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అదనంగా డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు.

షిర్డీసాయి జన్మదిన వేడుకలు



నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్‌యార్డు సమీపంలోని షిర్డీ సాయి సేవాశ్రమంలో బాబా వారి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆదివారం 190 కిలోల కేక్‌ను కట్ చేశారు. కాగడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో సామూహిక సాయిసత్యవ్రతాల్లో పాల్గొన్నారు. అన్నదానం చేశారు. బాబా వారికి గ్రామోత్సవం, జెండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు యువీ శివరామయ్య, సీహెచ్ పాపారావు, ఎం.సామ్రాజ్యం పర్యవేక్షించారు.

మల్లేశ్వరుని సన్నిధిలో ఎమ్మెల్యే చదలవాడ దంపతులు

పెదకాకాని: నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు దంపతులు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. పెదకాకాని శివాలయానికి ఆదివారం రాత్రి వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షణ అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి జరిగిన ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేశారు. స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి ప్రసాదాలు, చిత్రపటమును అందజేశారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వం సారధ్యంలో అమలు చేస్తున్న బీమా యోజన పథకాలను బ్యాంకు ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు) నరసరావుపేట రీజనల్ బ్యాంకు మేనేజరు ప్రహరాజు సుభాష్ అన్నారు. సోమవారం శావల్యాపురం బ్యాంకు శాఖను రీజనల్ మేనేజరు సందర్శించారు. ఈసందర్భంగా రీజనల్ మేనేజరు సుభాష్ మాట్లాడుతూ రీజనల్ పరిధిలో శావల్యాపురం బ్యాంకు శాఖ అన్ని రకాల సేవల్లో ముందంజలో ఉందన్నారు. 20 వేల మంది ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తుండగా రూ. 215 కోట్లు ఆర్థికలావాదేవీల నిర్వహణతో రెండవస్థానంలో ఉందన్నారు. బ్యాంకు ఖాతాదారులు రూ.456 చెల్లిస్తే రూ.4 లక్షల ప్రమాదబీమా, రూ.2లక్షల సాధారణ బీమా అందుతుందన్నారు. ఆయనతో పాటు బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ, బ్యాంకు అధికారులు అరుణ్ నెహ్రూ, దిలీప్‌కుమార్, సాయిరామ్, పావని, అనిల్‌కుమార్, రామిరెడ్డి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

బొల్లాపల్లి: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీ మాధురి సోమవారం తెలిపారు. వర్షాకాలం కావడటంతో వర్షాలు కురిసి గ్రామాల్లో పారిశుధ్యం వలన సీజనల్ వ్యాధులు బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రజలు త్రాగునీటి విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని కాచి, చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని సూచించారు. మండలంలో రేమిడిచర్ల, రెడ్డిపాలెం, మేళ్ల వాగు, కనుముల చెరువు, గుట్లపల్లి, హనుమాపురం, ఘాటి తండా, గంగుపల్లి, చక్రాయపాలెం లోని వాటర్ ట్యాంకులను తక్షణమే క్లీన్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలకు సురక్షిత, శుభ్రమైన మంచినీరు సరఫరా చేయాలని ఎంపీడీఓ పంచాయతీ పాలన యంత్రాంగానికి సూచనలు చేశారు.

సమాజ అభ్యున్నతికి తోడ్పడిన జాషువా

అమరావతి: సమాజ అభ్యున్నతికి తోడ్పడిన మహాకవి గుర్రం జాషువా అని సీపీఎం నేతలు కొనియాడారు. జాషువాకు ఆదివారం రాత్రి స్థానిక సీపీఎం కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన నివాళులు అర్పించారు. పార్టీ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ జాషువా సామాజిక అంశాలను సునిశిత దృష్టితో పరిశీలించి సామాజిక కవికోకిలగా నిలిచాడన్నారు. దళిత సంఘ నాయకుడు, వైఎస్సార్ సీపీ నేత తోకల సూరిబాబు మాట్లాడుతూ యువత గుర్రం జాషువా బాటలో నడిచి సామాజిక అణిచివేతలపై నిలదీయాలన్నారు. కార్యక్రమంలో పెదకూరపాడు వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం అధ్యక్షుడు షేక్ షరీఫ్, టి.లక్ష్మణ్, బూసి వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమి అకృత్యాలు అడ్డుకుందాం

- అన్యాయాలు, అక్రమాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయండి
- డిజిటల్ బుక్ క్యూ ఆర్‌కోడ్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తమపై జరిగిన దాడులు, అక్రమ కేసులు, జరిగిన అన్యాయం గురించి డిజిటల్‌బుక్‌లో నమోదు చేయాలని పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి డిజిటల్‌బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గత ఏడాదిన్నర కూటమి ప్రభుత్వంలో తమ పార్టీ కార్యకర్తలపై వేధింపులు, భౌతిక దాడులు విపరీతంగా జరిగాయన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలపై గంజాయి లాంటి అక్రమ కేసులు కూడా బనాయించి జైళ్ల పాలు చేస్తున్నారన్నారు. ఇళ్లు ధ్వంసం, కాళ్లు విరగ్గొట్టడం చేయటం లాంటివి చేస్తున్నారని, వీటన్నింటిని డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈ బుక్ కార్యకర్తలకు శ్రీరామరక్ష అన్నారు.ఇబ్బందిపెట్టేవారిని తమ ప్రభుత్వం రాగానే ప్రత్యేక బృందాలతో చట్టం ముందు నిలబెడతామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల మాటలు విని అక్రమ కేసులు పెట్టేవారిని, దౌర్జన్యం చేసే వారిని తప్పకుండా శిక్షించటం జరుగుతుందన్నారు. అప్పటికి ఎవరో ఒక నాయకుడిని పట్టుకొని తప్పించుకోవచ్చులే అనుకుంటే పొరపాటేనన్నారు. బాధిత కార్యకర్తలు సంతృప్తి చెందేంతవరకు చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే 10, 15ఏళ్లు తామే ఉంటామని కొందరు కూటమి నాయకులు చెప్పుకుంటున్నారని, దీనికి కొందరు కూటమి నాయకులే అసెంబ్లీ సాక్షిగా పెదవి విరిచారన్నారు. కూటమి ఎల్లకాలం ఉండదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. డిజిటల్ బుక్ ప్రాముఖ్యత ప్రతి గ్రామం వరకు తీసుకెళతామని చెప్పారు. పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ రాష్ట్ర కార్యదర్శి పడాల శివారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు గుజ్జర్లపూడి ఆకాష్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుతోళ్ల వేణుమాధవ్, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, పట్టణ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షుడు అచ్చి శివకోటి, సోషల్ మీడియా కన్వీనర్ బూదాల కల్యాణ్, నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మణీంద్రరెడ్డి, మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో ఓపీ సేవలు బంద్



రొంపిచర్ల పీహెచ్‌సీలో ఓపీ సేవలు నిలుపుదల చేస్తూ డోర్‌కు అంటించిన సమ్మె నోటీసు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు సాధారణ ఓపీ సేవలను సోమవారం నిలిపి వేశారు. జీవో నంబర్ 99 ప్రకారం పీజీ వైద్య సీట్లు ఏడు బ్రాంచీలకే పరిమితం చేశారు. జీఓ నంబర్ 99ని నిరశిస్తూ ప్రభుత్వ వైద్యులు నాలుగు రోజులుగా నిరసన తెలియజేస్తున్నారు. దానిలో భాగంగానే సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఓపీ సేవలను నిలుపుదల చేశామని వైద్యులు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రాల్లో నిరసన తెలియజేస్తామన్నారు. బుధవారం నుంచి విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ తమకు సహకరించాలని వైద్యులు కోరారు.

ఆరోగ్య కేంద్రం వైద్యుల సమ్మెబాట

శావల్యాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ నిరవధిక సమ్మె బాటకు దిగినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రావిపూడి రమ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో విలేకర్ల సమావేశంలో రమ్య మాట్లాడుతూ గత శనివారం నుంచి మెడికల్ క్యాంపులు, 104 వాహనాల సేవలను నిలిపివేసినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో పూర్తిస్థాయిలో విధులు బహిష్కరించాలని నిర్ణయించుకున్నామన్నారు. ఇందులో భాగంగా రేపటి నుంచి ఆరోగ్య కేంద్రంలో సాధారణ (ఓపీ) సేవలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. అలగే అత్యవసన వైద్య సేవలు మాత్రమే చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా టైమ్‌బౌండు ప్రమోషన్లు పదోన్నతుల లేకపోవటం, ఇన్ సర్వీస్ పీజీ కోటాను జీవో 99 రద్దు చేయాలని, నోషనల్ ఇంక్రిమెంట్ల మంజూరు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో సేవలందిస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనంతో పాటు గిరిజన భత్యంగా మంజూరు చేయాలనే.. ఇతర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని, లేకుంటే సమ్మె మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించారు.

కళావేదిక ప్రారంభం

నరసరావుపేట రూరల్: శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో నూతనంగా నిర్మించిన స్వామి వివేకానంద కళావేదికను దాత ఎన్ఆర్ఐ సన్నిది రాజేంద్రప్రసాద్ సోమవారం ప్రారంభించారు. సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రార్థనా మందిరంగా, విద్యార్థులు భోజనం చేసేందుకు కళావేదిక ఉపయోగపడుతుందని దాత రాజేంద్రప్రసాద్ తెలిపారు. అలాగే పాఠశాలలో లయన్స్ క్లబ్ సహకారంతో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సమితి అధ్యక్షుడు మిరియాల నాగప్రసాదరావు, పాఠశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కనకగిరి అనిరుద్ ఫణిభార్గవ్, పాఠశాల కార్యదర్శి కొత్త సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

వినుకొండ: రాష్ట్ర విద్యార్థి యువసేన ఆధ్వర్యంలో పట్టణంలో సర్దార్ భగత్‌సింగ్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర విద్యార్థి యువసేన అధ్యక్షుడు సంపెంగుల రవికుమార్ మాట్లాడుతూ 23 సంవత్సరాలకే ఉరితాడును ముద్దాడిన వ్యక్తి భగత్‌సింగ్ అని బ్రిటిష్‌వారిని గడగడలాడించి నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది యువతకు ధైర్యం నింపిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెలిగండ్ల కోటేశ్వరరావు, మన్నెం ఇజ్రాయిల్, రాచపూడి రాజు, కుంచాల అఖిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపకపోతే ఉద్యమిస్తాం

సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు శిలార్ మసూద్



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న శిలార్ మసూద్

నరసరావుపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మున్సిపల్, ఇంజినీరింగ్ కార్మికులు, స్కీం వర్కర్లపై వేధింపులు ఎక్కువయ్యాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయు) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్. సిలార్ మసూద్ మండిపడ్డారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఎక్కువయ్యాయని వీటికి నిదర్శనమే అనంతపురం మున్సిపాలిటీ పరిధిలో ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న యూనియన్ నాయకుడు గౌరీ శంకర్‌పై అధికారులు అక్రమ కేసు బనాయించి విధుల నుంచి తొలగించాలని చూస్తున్నారని, తక్షణమే కేసులు ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికురాలు పద్మపై దాడి చేసి, దుర్భాషలాడిన జనసేన కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులపై వేధింపులు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు సోమశేఖర్, సామ్రాజ్యం, ఖాసీం, నాగయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గుండె జబ్బులపై అప్రమత్తత అవసరం

పలు జాగ్రత్తలు సూచించిన హృద్రోగ నిపుణులు డాక్టర్ కారసాని



నరసరావుపేట: గుండెజబ్బులతో అకాల మరణాలకు తావీయకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ హృద్రోగ నిపుణులు, ఏపీ కార్డియాలజికల్ సొసైటీ కార్యదర్శి, మహాత్మాగాంధీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కారసాని శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా హాస్పిటల్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గుండె జబ్బుల నివారణకు ఈ ఏడాది 'బీట్‌ను మిస్ చేయవద్దు. మీ గుండెను కాపాడుకోండి' అనే నినాదాన్ని పాటిస్తున్నారన్నారు.. శరీరంలో వచ్చే చిన్న మార్పులు పెద్దతేడా తీసుకురాగలవని హెచ్చరించారు. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటివి అదుపులో లేనివారికి గుండెజబ్బులు వచ్చేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ జబ్బు ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా తీవ్రంగా ఉందని, రోజురోజుకు అకాల మరణాల సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. ప్రతి ఐదు అకాల మరణాల్లో ఒకటి గుండె జబ్బు వలనే జరుగుతుందన్నారు. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు యువతలో గుండెజబ్బులు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. వీలైనంతవరకు లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లు ఎక్కాలని, క్రమబద్ధమైన వ్యాయామం పాటించాలని, తీసుకునే ఆహారంలో పండ్లు, కూరగాయలు, పీచు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని, వేపుళ్లు, ఉప్పు తినటం తగ్గించాలని సూచించారు. ధూమపానం, మద్యపానంకు దూరంగా ఉండాలని, పనిలో ఒత్తిడి తగ్గించుకోవాలన్నారు. శ్వాస ఆడక పోవటం, ఛాతీ నొప్పి వంటి శారీరక హెచ్చరికలను విస్మరించకుండా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని కోరారు.

ఆహార నియమాలు పాటించాలి...

నరసరావుపేట: జీవన విధానం, ఆహార నియమాలు పాటించడం ద్వారా గుండె జబ్బులు లేకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో సోమవారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ ఏంఆర్ శేషగిరిరావు మాట్లాడుతూ గుండె జబ్బులు, స్ట్రోక్‌తో సహా కార్డియోవాస్కులర్ వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాలలో ఒకటి అవుతున్నాయన్నారు. డాక్టర్లు శాఖమూరి బాజీబాబు, చింతగుంట శిరీష, కూని శెట్టి గౌతమ్, పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మెరుగైన జీవన విధానం, గుండెకు ఆరోగ్యకరమైన ఆహారం, ఒత్తిడిని జయించటం, శారీరక శ్రమ ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ కేఎంఎస్‌వీ శ్రీనివాసగుప్తా, కోశాధికారి డాక్టర్ నంద్యాల రాంప్రసాదరెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు బత్తుల మురళి పాల్గొన్నారు.

సాతులూరులో వైద్యశిబిరం

నాదెండ్ల: సాతులూరు గుంటూరు వెంకటప్పయ్య ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సాయిశ్వేత, జ్ఞానేశ్వరి పాల్గొని 121 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో పోషకాభియాన్ స్టాల్ నిర్వహించి మహిళలు, చిన్నారులకు పోషకాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సాగర్‌బాబు కుటుంబానికి న్యాయం చేయాలి



సాగర్‌బాబు కుటుంబం చేస్తున్న నిరాహారదీక్షకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నేతలు

నరసరావుపేట రూరల్: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వికలాంగుడిగా మారిన వరల సాగర్‌బాబు కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జొన్నలగడ్డలోని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెంట్ కార్యాలయం వద్ద నిరాహారదీక్ష చేస్తున్న బాధిత కుటుంబానికి సోమవారం ప్రజా సంఘాల నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వర్లు మద్దతు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని సాగర్‌బాబు, భార్య కెజియా ఇతర కుటుంబ సభ్యులు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా నల్లపాటి రామారావు మాట్లాడుతూ సాగర్‌బాబు వికలాంగుడిగా మారడానికి విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్షమే కారణమన్నారు. గ్రామంలో రథోత్సవానికి అడ్డుగా ఉన్న విద్యుత్‌వైర్లు తొలగించాలని ప్రైవేటు లైన్‌మెన్ సాగర్‌బాబును స్తంభం మీదకు సిబ్బంది ఎక్కించారని తెలిపారు. ఈ సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై స్తంభంమీద నుంచి పడి సాగర్‌బాబు వెన్నుముక విరిగిపోయి వికలాంగుడిగా మారడని తెలిపారు. ఇప్పటి వరకు సాగర్‌బాబు కుటుంబాన్ని విద్యుత్ శాఖ అధికారులు ఆదుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకుడు రెడ్డిబోయిన ప్రసన్నకుమార్, ప్రజాకళా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉన్నం రాణి, మాల మహానాడు నాయకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో సామాన్యులకు ప్రయోజనం



గణపవరంలో వ్యాపారులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాదెండ్ల: కేంద్ర ప్రభుత్వం సడలించిన జీఎస్టీతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని సత్తెనపల్లి సర్కిల్ జీఎస్టీ అధికారి, నాదెండ్ల మండల నోడల్ ఆఫీసర్ సునీల్‌బాబు చెప్పారు. గణపవరంలో వ్యాపారులు, స్థానిక ప్రజలకు సవరించిన జీఎస్టీ ప్రయోజనాలు వివరించారు. తగ్గించిన జీఎస్టీతో ఒక్కో కుటుంబానికి రూ.15 వేల వరకు ఆదా అవుతుందన్నారు. గతంలో జీఎస్టీ, ప్రస్తుత జీఎస్టీ వివరాలను షాపుల ముందు బోర్డులో చూపాలని వ్యాపారులను ఆదేశించారు. మండల స్థాయిలో నెలరోజుల పాటూ ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మారుతీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది దూరం...

సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమానికి సచివాలయ సిబ్బంది గైర్హాజరయ్యారు. ఇంటింటికి తిరిగే కార్యక్రమాలను తమకు కేటాయించవద్దని ఇప్పటికే సచివాలయ సిబ్బంది ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సూపర్ జీఎస్టీ కార్యక్రమానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుని, వాట్సాప్ గ్రూపుల నుంచి కూడా నిష్క్రమించారు.

వినుకొండలో..

వినుకొండ: కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు షాపుల యజమాన్లు, ఫెర్టిలైజర్స్ షాపుల యజమానులు, పలు అసోసియేషన్ నాయకులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జీఎస్టీ 2.0పై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరసరావుపేట జీఎస్టీ ఇన్‌చార్జి రామలింగయ్య మాట్లాడుతూ జీఎస్టీలో వచ్చిన మార్పులను తెలియజేశారు. తహసీల్దార్ సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ



డిజిటల్ బుక్ యాప్ ఆవిష్కరణలో దేవినేని శంకరరావు, చిలకలూరిపేట మండల నాయకులు

చిలకలూరిపేట: కార్యకర్తలు ఎదుర్కొంటున్న ప్రతి అన్యాయాన్ని డిజిటల్ బుక్‌లో నమోదు చేద్దామని... పార్టీ కార్యకర్తల రక్షణ కోసం పాటుపడదామని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట మండల పార్టీ అధ్యక్షుడు, ఎంపీపీ దేవినేని శంకరరావు చెప్పారు. మాజీ మంత్రి విడదల రజిని నివాసం వద్ద మండల పార్టీ ముఖ్య నాయకులతో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న వేధింపులు, కక్ష సాధింపు చర్యల నివారణకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ యాప్‌ను రూపొందించారని చెప్పారు. పార్టీ మైనార్టీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అప్పాపురం షేక్ రమేష్‌బాబు, యువజన విభాగం అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాసునాయుడు, క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మైలా రాజేష్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు పఠాన్ దౌలత్‌ఖాన్, బూత్ కమిటీ విభాగం అధ్యక్షుడు మానుకొండ శేషిరెడ్డి, నాయకులు గుత్తా యాములయ్య, గోరంట్ల ఉమామహేశ్వరరావు, నలమాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో సరస్వతీదేవీ అలంకారంలో..



నాదెండ్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



నరసరావుపేటలో సరస్వతీ అలంకరణలో శారదాంబ



విప్పర్లలో మహా సరస్వతి దేవిగా కామాక్షి అమ్మవారు



సరస్వతీదేవిగా బోయపాలెం పార్వతీదేవి..



ఐనవోలులో ఉత్సవాల్లో భాగంగా కోలాటం చేస్తున్న మహిళలు

• సరస్వతీ నమస్తుభ్యం..!

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని అమ్మవారు మహా సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

– నరసరావుపేట ఈస్ట్ /నాదెండ్ల /రొంపిచర్ల /చిలకలూరిపేట /నూజెండ్ల /యడ్లపాడు /శావల్యాపురం /వినుకొండ /యడ్లపాడు



నూజెండ్ల రాములవారి దేవస్థానంలో అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులు



శావల్యాపురంలో సరస్వతీదేవి అలంకరణ



సరస్వతీదేవి అలంకరణలో రింగారావుపాలెం పార్వతిదేవి



కొబ్బరిబొండాల అలంకరణలో వినుకొండ వాసవీ అమ్మవారు

మహిళ మిస్సింగ్ కేసు ఛేదన

నూజెండ్ల: మిస్సింగ్ కేసును ఐనవోలు పోలీసులు రెండు రోజుల్లో ఛేదించారు. మనస్పర్ధల కారణంగా అలిగి ఇంటి నుంచి వెళ్ళిపోయిన భార్యను భర్తకు అప్పగించారు. ఐనవోలు ఎస్సై కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జడ్డావారిపాలెం గ్రామానికి చెందిన గురువర్ధినిని ప్రకాశం జిల్లా దొనకొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తోటా వెంకటేశ్వర్లుకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇరువురు సంతానం ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావటంతో పుట్టింటికి వచ్చింది. అక్కడ కూడా భర్త వద్దకు కాపురానికి వెళ్లమని తల్లి సర్ది చెప్పటంతో అందుకు ఒప్పుకోని గురువర్ధిని ఇంటి నుంచి పిల్లలతో వెళ్ళిపోయింది. ఈ మేరకు తల్లి పారా సీతమ్మ ఈ నెల 27వ తేదీన ఐనవోలు పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గుంటూరు బస్టాండ్‌లో మహిళ పిల్లలతో ఉన్నట్లు సమాచారం రావటంతో పోలీసులు వెళ్లి ఆమెను గుర్తించి స్టేషన్‌కు తీసుకు వచ్చారు. సోమవారం తల్లి సమక్షంలో ఆమెను భర్త వెంకటేశ్వర్లుకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.